

కథా కౌముది

# రాణా ప్రతాప్ మాలా కుమార్

సంయుక్త కిటికీ లో నుంచి బయటికి చూస్తోంది. చిక్కని చీకటి! సన్నగా జల్లులు కూడా పడుతున్నాయి. ఆ చీకట్లోకే ఆలోచనగా చూస్తున్న సంయుక్తకు పిల్లగాలి మృదువుగా చెంపను తాకి, "నువ్వు అక్కడ కూర్చున్నావు, నేను ఇక్కడ కూర్చొని చేతిలో రమ్ గ్లాస్ పట్టుకొని నీ గురించే ఆలోచిస్తున్నాను. నాకేమనిపిస్తోందో చెప్పనా?" అని భరత్ చిలిపిగా నవ్వినట్టుగా అనిపించింది.

"పర్మిషన్ ఎందుకో దొరగారికి! ఆలశ్యం చేయకుండా చెప్పేయండి" అంది.

"తెల్లని మంచు సన్నసన్నగా మల్లెపూల వానలా కురుస్తూ గిలిగింతలు పెడుతోంది. అబ్బా... ఇప్పుడు నా రాణి నా పక్కన ఉంటేనా..." మనసును దోచే కమ్మని నవ్వు కమ్మేసింది!

చిన్నగా నిట్టూర్చింది. ఎందుకో ఈ రోజు ఉదయం నుంచీ మనసు చాలా కలవరంగా ఉంది. చెప్పలేనంత భారంగా ఉంది. ఎంత తమాయించుకున్నా మనసు తన మాట వినటం లేదు. ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి. ఆలోచిస్తూ దీర్ఘంగా బయటికి చూస్తూ కూర్చొని ఉంది సంయుక్త.

"మమ్మీ" పిలుపు వినిపించి, గబుక్కున లేచి చూసింది. మంచం మీద మూడేళ్ళ రాణా కళ్ళను నలుపుకుంటూ లేచి కూర్చున్నాడు. వెళ్ళి వాడిని దగ్గరికి తీసుకొని "కన్నా మెలకువ వచ్చిందా? బజ్జో నాన్న" అంటూ బాబుకు జో కొడుతూ, మళ్ళీ ఏదో ఆలోచనలో మునిగిపోయింది. బాబు నిద్రపోయినాడు. వాడిని చిన్నగా మంచం మీద పడుకోబెట్టి, రీడింగ్ టేబుల్ దగ్గరికి నడిచింది. కూర్చుంటూ టేబుల్ లాంప్ ఆన్ చేసి, పెన్ను, పేపర్ హెడ్ తీసుకుంది.

ప్రియా!

ఎట్లా ఉన్నావు? నేను చాలా బాగున్నాను. మొన్న దీపావళి చాలా బాగా చేసుకున్నాము. పిట్టగోడ మీద, కింద కాంపౌండ్ వాల్ పైన, టెరస్ మీద దీపాలు వెలిగించాను. ఆ దీపాల వెలుగులో మన ఇల్లు ఎంత మెరిసిపోయిందో

తెలుసా! ఆ జ్యోతుల కళకళలో నీ కన్నుల జ్యోతులే కనిపించాయి. నా పక్కన చేతులు కట్టుకొని నిలబడి, నవ్వుతూ నువ్వు కూడా చూసావు కదా! నాకు తెలుసులే!

మామయ్యగారు, "నీ కొడుకు వీరజవానోయ్! నువ్వేమిటీ కాకరపూవత్తే కాలుస్తున్నావు?" అని అత్తయ్యను ఆటపట్టించారు. అత్తయ్యగారు నవ్వేసి ఊరుకున్నారు. నువ్వు మాత్రం తక్కువోడివా? కాకరపూవత్తి తీసుకున్న నన్ను చూసీ "హే...హే.. ఫౌజీ కి పత్నీ కాకరపూవొత్తికాదు, అగ్గిపుల్ల కాల్చు" అని పెద్దగా నవ్వావు కదూ! చెప్పొద్దూ కాస్త భయపడ్డ కానీ ఉక్రోషంగా వెళ్ళి రాకెట్ కాల్చాను. అది జుయ్ మంటూ నీ దగ్గర వాలిందిగా! నీకు తెలుసు నన్ను ఎట్లా ఉత్సాహ పరచాలో!

బుజ్జిగాడు, అదేనోయ్ నీ రాణా దివాలి పిస్తోల్ తో ఢాం... ఢాం... అని భలే ధైర్యంగా పేల్చాడులే! ఇంత చిన్నవాడు ఎంత ధైర్యంగా పిస్తోల్ పేల్చాడో! తండ్రిలాగే మిలిట్రీ ఆఫీసర్ అవుతాడు అని చుట్టుపక్కలవాళ్ళు మెచ్చుకుంటుంటే, మామయ్యగారు వాడిని ఎత్తుకొని, ముద్దుపెట్టి, మురిసిపోయారు.

అత్తయ్య పొద్దున్న గారెలు, పాయసం, పులిహోర చేసారు. అన్నట్టు నీకు ఇష్టమైన బొబ్బట్లు కూడా చేశారు అత్తయ్య. పల్చగా, మృదువుగా ఎంత బాగున్నాయో తెలుసా? చాలా రుచిగా ఉన్నాయి. నువ్వు మా పక్కన కూర్చొని ఆ బొబ్బట్లు తింటూ వాటి రుచి ఆస్వాదిస్తున్నట్టుగానే అనిపించింది.

ప్రియా! నాకు తెలుసు దీపావళి పండగ అంతా నువ్వు మా తోటే ఉన్నావు మేము నీతోటే ఉన్నాము చాలా సరదాగా బాగా గడిచిపోయింది.

రాస్తూ రాస్తూ ఆగింది. మసక బారిన కళ్ళను తుడుచుకుంటూ మళ్ళీ రాయటం ప్రారంభించింది.

నాకు గుర్తుంది ప్రియా. నువ్వు మొదటిసారి బార్డర్ కి వెళ్లేటప్పుడు నేను అనుకున్నాను అసలు ఏడవకూడదు. అన్ని తెలిసే నేను భరత్ ని పెళ్లి చేసుకున్నాను. నా భరత్ విజేయుడైరావాలి. నా కళ్ళల్లో నీళ్లు నీకు అశుభము అనుకున్నాను. అయినా ఎందుకు ఏడవాలి ఏడవద్దు అనుకున్నాను. అందుకే నువ్వు వెళ్తుంటే చిన్నగా హగ్ చేసుకొని, ఫోన్ చేస్తూ ఉండండి. వీలైనప్పుడు ఉత్తరాలు రాస్తూ ఉండండి. అని చెప్పి నవ్వుతూ మీకు వీడ్కోలు పలికాను. నా నవ్వు, నా ధైర్యం మీకు ధైర్యాన్నిస్తుంది అని నాకు తెలుసు. కొన్నిసార్లు మీ దగ్గర నుంచి ఫోను వెంట వెంటనే వచ్చేది. కొన్నిసార్లు ఆలశ్యం అయ్యేది. ఆలశ్యంగా వచ్చినప్పుడు అత్తయ్య, ఎట్లా ఉన్నాడో వాడు అని దిగులు పడుతుంటే... దిగులు ఎందుకండీ మంచిగానే ఉండుంటారు. సిగ్నల్స్ కలవలేదేమో అని నవ్వుతూ చెపుతాను. నువ్వే మాకు ధైర్యం తల్లి అని ప్రేమగా హత్తుకుంటారు అత్తయ్య.

మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. మంచుపూలవాన అంటూ రమ్ ఎక్కువగా పట్టించకండి. దానితో బొజ్జ బోనస్‌గా వస్తుంది బాస్! మరి మీరంతా దివాళీ ఎట్లా చేసుకున్నారో వ్రాయండి. ఏమోనబ్బా, ఫోన్ లో

మాటలకన్నామీరు వ్రాసే ఉత్తరాలు పదేపదే చదువుకుంటూ మనసంతా నువ్వే అని పాడుకుంటూ ఎంజాయ్ చేస్తాను. అంత బాగా వ్రాస్తారు మీరు. అలాగని ఫోన్ చేయటం ఆపకండి. మీ మాటలూ మధురమే!

మరి ఇక ఉండనా!

మీ సమ్ము.

ఉత్తరం మరోసారి చదువుకొని, మడిచి కవర్‌లో పెట్టి, అడ్రెస్ వ్రాసి, మూసేసింది. రేపొద్దున మర్చిపోకుండా పోస్ట్ చేయాలి అనుకుంటూ, బాబు పక్కన నడుము వాల్చింది.

ఫోన్ రింగ్ అవుతున్న చప్పుడుకు, కళ్ళు తెరిచి, పక్కనే ఉన్న సెల్ అందుకుంటూ ఎవరి దగ్గర నుంచాని పేరు చూసింది. భరత్ స్నేహితుడు కెప్టెన్. భాటియా. ఇంత పొద్దున్నే ఈయన ఎందుకు చేసాడా...అని, దడదడలాడుతున్న గుండెను చిక్కబట్టుకొని, "హల్లో... మిసెస్. భరత్ హియర్" అంది చిన్నగా.

ఒక్క నిమిషం నిశ్శబ్దం...

"భాభీ, నిన్న రాత్రి టెరరిస్ట్ అటాక్‌లో భరత్ కు బులెట్స్ తగిలి గాయాలయ్యాయి. మా దగ్గర ఫస్ట్ ఎయిడ్ చేసి హెలికాప్టర్ లో ఫీల్డ్ ఆస్పత్రికి పంపాము. ప్రస్తుతం ట్రీట్మెంట్ జరుగుతోంది. భయపడేది ఏమీ లేదు" అన్నాడు.

తనేమి విన్నదో ఒక్క క్షణం బుర్రకు ఎక్కలేదు. అప్పుడే అక్కడికి వచ్చిన మామగారు గోపాలరావు ఏమిటి అన్నట్లు చూసాడు.

"కాప్టెన్. భాటియా, నిజం చెప్పండి. భరత్ ఎట్లా ఉన్నాడు? అసలు ఏమి జరిగింది?" వణుకుతున్న కంఠంతో అడిగింది. మామగారు కూడా వినాలని స్పీకర్ ఆన్ చేసింది.

"భాభీ, ప్రాణాపాయం లేదు. నిన్న భరత్ నైట్ డ్యూటీలో ఉన్నప్పుడు టెరరిస్ట్‌లు అటాక్ చేసారు. వారితో జరిగిన పోరాటం లో భరత్‌కు బులెట్స్ తగిలాయి. అయినా భరత్ వెనకకు తగ్గకుండా ఆ టెరరిస్ట్ తో వీరోచితంగా పోరాడి, చంపేసాడు" ఒక్క క్షణం చెప్పటం ఆపేసాడు.

"తరువాత ఏమయింది? ఇప్పుడు భరత్ ఎక్కడ ఉన్నాడు? ఎట్లా ఉన్నాడు?" గాభరాగా అడిగాడు గోపాలరావు.

"భరత్ కు బాగా దెబ్బలు తగిలియాయి. రక్తం కారుతున్నా లెక్క చేయకుండా థంస్ అప్ చూపిస్తూ కాంప్ దగ్గరకు వచ్చాడు. We are proud of him. వెంటనే ఇక్కడ ప్రాథమిక చికిత్స చేసి, ఫీల్డ్ హాస్పిటల్ కు పంపాము" అన్నాడు.

"మరి మేము వస్తాము" వెంటనే అంది సంయుక్త.

"సారీ భాభీ. ఇక్కడ సెక్యూరిటీ కారణంగా కుటుంబ సభ్యులను రానివ్వరు. ఫీల్డ్ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ పూర్తయ్యాక, త్వరలోనే ఢిల్లీ హాస్పిటల్ కు పంపుతారు. స్పెషలైజ్డ్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను మాట్లాడేందుకు అనుమతిస్తారు. అప్పుడు మీరు రావచ్చు. అక్కడ మీరు ఉండేందుకు ప్రత్యేక గెస్ట్ హౌజ్ ఏర్పాటు చేస్తారు. ఈలోపల మీరు ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చేసుకోండి. డిల్లీ కి పంపాక, మీకు టికెట్ పంపుతాము. భయపడకండి, దెబ్బలు బాగా తగిలాయి కానీ ప్రాణాపాయం లేదు" అని ధైర్యం చెప్పి ఫోన్ పెట్టేసాడు భాటియా.

★★★

భరత్ ను డిల్లీ హాస్పిటల్ కు మారుస్తున్నట్లు తెలియగానే భరత్ తల్లితండ్రులు గోపాలరావు, జానకి, సంయుక్త రాణాను సంయుక్త తల్లితండ్రుల దగ్గర ఉంచి ఢిల్లీ వచ్చారు. భరత్ ను చూసేందుకు పర్మిషన్ రాగానే

హాస్పిటల్‌కు వచ్చారు. ఒకొక్కరుగా లోపలికి వెళ్ళి చూసారు.

మంచం మీద... మొహానికి ఒక వైపు అంతా, కుడి చేతికి బాండేజ్‌తో పడుకొని ఉన్న భరత్ ను చూడగానే మనసులో నుంచి దుఃఖం పొంగుకు వచ్చింది సంయుక్తకు. కానీ తనను తాను నిలువరించుకొని, భరత్ చేతి మీద చేయి వేసింది. చిన్నగా కళ్ళు తెరిచి నవ్వాడు భరత్. మాట్లాడబోయాడు కానీ మాట్లాడలేకపోయాడు. నొప్పిగా ఉన్నట్లు చెంప మీద ఎడం చేతిని చిన్నగా వేసుకున్నాడు. ఒక కన్ను మాత్రమే కొద్దిగా తెరిచి చూడగలుగుతున్నాడు. భరత్ తన వైపు చూడగానే చిన్నగా నవ్వి, భరత్ చేతిని మృదువుగా ముద్దు పెట్టుకుంది. “వుయ్ ఆర్ ప్రౌడ్ ఆఫ్ యూ బాస్” అంటూ థంస్ అప్ చూపించింది. సంయుక్త చూపించిన ప్రేమకు భరత్ మనసంతా ఆహ్లాదంగా అయ్యింది. సంయుక్త చేతిని చిన్నగా తట్టాడు.

కొద్దిసేపు అక్కడే కూర్చొని, బయటకు వచ్చింది.

సమయం అయిపోగానే బయటకు వచ్చి, అందరూ అక్కడి డ్యూటీ డాక్టర్‌ను కలిసారు.

"మొహం మీద మూడు బులెట్స్, కుడి చేతికి రెండు బుల్లెట్స్ తగిలాయి. కన్ను పక్కన, చెవికి, నోటికి దగ్గరగా తగిలాయి. అదృష్టవశాత్తు చూపుకు, వినికిడికి ఇబ్బంది లేదు. కొన్ని రోజులు, మాట్లాడటానికి, భోజనం నమలటానికి ఇబ్బందిగా ఉంటుంది. వీలయినంతగా మెత్తగా చేసి పెట్టాలి. ఈ గాయాలు మానటానికి సమయం పడుతుంది. ఆ తరువాత అవసరం అవుతే మొహానికి ప్లాస్టిక్ సర్జరీ చేస్తాము. దీనికంతా కొంచం ఎక్కువగానే సమయం పట్టవచ్చు. ప్రస్తుతం గాయాలు తగ్గాక డిస్చార్జ్ చేస్తాము. అసలు అన్ని దెబ్బలతో, గర్వంగా థంస్ అప్ చూపిస్తూ నడిచి ఎట్లా కాంప్‌కు వచ్చాడో మాకందరికీ ఆశ్చర్యమే" అన్నాడు డాక్టర్.

ఒక వారం ప్రతిరోజూ సాయంకాలం విజిటర్స్ సమయంలో హాస్పిటల్‌కు వెళ్ళి భరత్ ను చూసి వచ్చేవారు జానకి, గోపాలరావు, సంయుక్త. మిలిట్రీ హాస్పిటల్స్ లలో రూల్స్ చాలా స్ట్రిక్ట్ గా ఉంటాయి. విజిటర్స్ సమయంలో తప్ప

మిగతా సమయంలో ఎవరినీ రానీయరు. అదీ కొద్ది సేపు మాత్రమే రానిస్తారు. భరత్ కొద్దిగా కోలుకున్నాడు. కొంచం కొంచంగా మాట్లాడగలుగుతున్నాడు. ఇక అక్కడ వుండి ఎవరూ ఏమీ చేసేది లేదు. రాణా కూడా బెంగపడుతున్నాడని జానకిని పంపేసారు. భరత్ ను డిస్చార్జ్ చేసే వరకూ అక్కడే ఉంటానన్నది సంయుక్త. ఆడపిల్లను ఒక్కదానిని ఏమి ఉంచుతామని గోపాలరావు కూడా ఉండిపోయాడు.

ప్రతిరోజూ సాయంకాలం కాసేపు గోపాలరావు, సంయుక్త భరత్ పక్కన కూర్చుని కబుర్లు చెప్పేవారు. కొద్దిసేపు తరువాత భార్యాభర్తలకు ఏకాంతం కలిపిస్తూ గోపాలరావు బయటకు వెళ్ళిపోయేవాడు. సంయుక్త భర్తను ముద్దు చేస్తూ, హాస్పిటల్ వాళ్ళు ఇచ్చిన సూప్ తాగలేనని మారాము చేస్తున్న భరత్ ను బుజ్జగిస్తూ తాగించేది. ఆ సమయంలో నర్స్ చూసి, "మేడం, సర్ ని చూడండి, మిమ్మల్ని చూడగానే వారి మొహంలో వెలుగు వచ్చింది. మీ దగ్గర గారాలు పోతున్నారు" అని నవ్వుతూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

అనుకున్నదానికన్నా ముందే భరత్ చాలావరకు కోలుకున్నాడు. డిస్చార్జ్ చేస్తూ, డాక్టర్ "మిసెస్.భరత్ మీరు చాలా ధైర్యంగా పరిస్థితిని ఎదురుకున్నారు. చాలా స్మూత్ గా హాండిల్ చేసారు" అని మెచ్చుకున్నాడు.

ఇంటికి వచ్చిన భరత్ స్నేహితులు చుట్టాలు ఘనంగా స్వాగతం ఇచ్చారు. టి.వీ లు, పేపర్ ల వాళ్ళూ ఇంటర్వ్యూలు తీసుకున్నారు. కొద్దిరోజులు అందరితో గడిపి, పూర్తిగా నయం అయ్యాక తిరిగి డ్యూటీలో చేరాడు భరత్!

★★★

బయట అంతా గాఢాంధకారం. కన్ను పొడుచుకున్నా కనిపించనంత కటిక చీకటి. కిటికీ పక్కగా ఉన్న కొబ్బరి చెట్టు ఆకులు అప్పుడప్పుడు గాలికి కదులుతున్నాయి. అవి చేసే చిరు సవ్వడి, అప్పుడప్పుడు ఎక్కడో జరుగుతున్న బ్లాస్టింగ్ చప్పుడు తప్ప ఇంకే శబ్దమూ వినిపించటము లేదు. అలాగే గడ్డం కింద చేయి ఆనించి చీకట్లోకి చూస్తోంది సంయుక్త. ఈ కిటికీ, ఈ చీకటి నా జీవితంలో భాగం అయ్యాయి చిన్నగా నవ్వుకుంది. ఆ నిశబ్దాన్ని ఛేదిస్తూ పోలీస్ పెట్రోలింగ్ కార్ బుయ్... మంటూ వెళ్ళింది. రోడ్ మీద నిద్రపోతున్న కుక్క ఉలిక్కిపడి లేచి, నిద్రాభంగం అయినందుకు విసుగ్గా ఓ అరుపు అరిచి, మళ్ళీ బద్దకంగా పడుకుంది. అవేవీ సంయుక్త ఆలోచనలను భంగపరచలేకపోతున్నాయి. అలాగే చీకట్లోకి చూస్తూ కూర్చుంది.

"అమ్మా..." పెద్దగా పిలుపు వినిపించింది.

అప్రయత్నంగా "రాణా... కన్నా.." అంటూ కుర్చీలో నుంచి లేచింది.

"సమ్యూ... ఇంకా పడుకోలేదా?" పక్క మీద నుంచి లేచి వస్తూ అడిగాడు భరత్.

తిరిగి కుర్చీలో కూర్చుంటూ "నిద్ర రావటం లేదు. రాణా..." గొణిగినట్లుగా అంటూ భరత్ నడుము చుట్టూ చేతులు వేసి పొట్టలో మొహం దాచుకుంది.

"సమ్మూ... ఏమిటీ బేలతనం? మేము మిలిట్రీ ట్రైనింగ్ తీసుకుంటే నువ్వు ఏ ట్రైనింగ్ లేకుండానే నిన్ను నువ్వు ట్రేన్ చేసుకున్నావు. ఫౌజీ కి పత్నీ, ఫౌజీ కీ మాతవు అని గర్వంగా అందరూ అంటారు. ఇదేమిటి?" సంయుక్త తల నిమురుతూ అనునయంగా అన్నాడు భరత్.

"ఏమోనండీ, ఆరోజు మీరు గాయపడ్డప్పుడు కూడా నా మనసు ఇలాగే కలవర పడింది. ఈరోజు ఎందుకో పొద్దుటి నుంచీ చాలా బాధగా ఉంది. అయినా ఇప్పుడు ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. పెద్దదానిని అయ్యాను కదా! అమ్మను. ఇన్ని సంవత్సరాలు గడిచినా... వదలని అరాచకాలు చేసే ఈ టెర్రరిస్ట్ లను దేవుడు ఎందుకు శిక్షించడు?" అంటూ భరత్ ను మరింత దగ్గరగా హత్తుకుంది.

"దేవుడు శిక్షించకుండా వదిలేసినా మనం వదిలేయము కదా! భయపడకు. రాణా ప్రతాప్ వస్తాడు. చిన్నప్పటి నుండి వాడికి రాణా ప్రతాప్, శివాజీ కథలు చెప్పి ఒక వీరుడిగా చేసావు. దేశ రక్షణకు ఒక మిస్సైల్ గా పంపించావు. నీ మిస్సైల్ గురితప్పదు." అంటూ సంయుక్తను లేపి మంచం మీద పడుకోబెట్టి "కళ్ళు మూసుకొని నిద్రపోవటానికి ప్రయత్నించు సమ్మూ." ఆమెకు ధైర్యంగా తన చేతిని సంయు పైన వుంచి జోకొడుతూ... కంఫర్టర్ కప్పాడు.

★★★

It is God's job to forgive terrorists, but it is our job to make them meet God.

– Indian Army

★★★★★

COMMENTS